గ్రేటర్‌లో కొత్త పన్నుల విధానం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో గ్రేటర్‌లో కొత్త పన్నుల విధానం అమల్లోకి రానుందని సమాచారం. ఇప్పుడున్న పన్నుల విధానాన్ని సరళీకృతం చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం యోచిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచన మేరకు ఇందుకు సంబంధించి అధికారులు కసరత్తు చేస్తున్నారు. నగరంలో ప్రస్తుతం ఆస్తి పన్నులను జిహెచ్‌ఎంసి, నల్లా బిల్లులను హైదరాబాద్ జలమండలి వసూలు చేస్తున్నాయి. జిహెచ్‌ఎంసి పరిధిలోని నివాసాలకు నెలకు 20 వేల లీటర్ల వరకు తాగు నీటిని ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తోంది. అంతకు మించి నీటిని వాడుతున్న అపార్ట్ మెంట్ల నుంచి మాత్రమే నల్లా బిల్లులను వసూలు చేస్తున్నారు. ఆస్తి పన్ను ఆరు నెలలకోసారి, నల్లా బిల్లులను నెలకోసారి జారీ చేస్తున్నారు. ఇంటింటికీ తిరిగి చెత్త సేకరించేందుకు కొన్ని ప్రాంతాల్లో నామమాత్రంగా రూ.50 వసూలు చేస్తున్నారు. ఈ బిల్లుల చెల్లింపు వినియోగదారులకు మరింత వెసులుబాటుగా ఉండేలా కొత్త విధానం తెనున్నారు. డిస్కంలు ప్రతి నెలా కరెంట్ బిల్లు పద్ధతి ప్రకారం జారీ చేస్తాయి. యూపీఐ ద్వారా ఆన్‌లైన్‌లోనే ప్రతి నెలా చెల్లించే సదుపాయం అందుబాటులో ఉంది.క్రమం తప్పకుండా బిల్లులు చెల్లిస్తున్నారు. ఇదే తరహాలో ఆస్తి పన్ను. నల్లా బిల్లుతో పాటు చెత్త సేకరణ బిల్లు కూడా నెల వారీగా జారీ చేసేలా కొత్త విధానంపై కసరత్తు చేస్తున్నారు. ఒకేసారి ప్రజలపై ఎక్కువ ఆర్థిక భారం పడకుండా ఉంటుందని భావిస్తున్నారు.


సిపిఎస్ రద్దు చేయాలని అక్టోబర్ 2న ఎఐడిఇఎఫ్ ప్రతిజ్ఞ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిపిఎస్ పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 2న గాంధీ విగ్రహం ముందు ప్రతీజ్ఞ చేయాలని ఆల్ ఇండియా డిఫెన్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పిలుపునిచ్చింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ఎన్ పాథక్, సి.శ్రీకుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. 'ఉద్యోగుల మూలవేతనం, డిఎల నుంచి ప్రతి నెలా కట్‌చేసిన 10 శాతానికి, మరో 10 శాతం కలిపి ప్రభుత్వం బ్యాంకులో జమ చేస్తుంది. రిటైర్ అయిన తర్వాత ఈ మొత్తం నుంచి 60 శాతం ఉద్యోగికి చెల్లిస్తారు. మిగతా 40 శాతం సొమ్మును స్టాక్ మార్కెట్‌లో కొనసాగిస్తూ లాభనష్టాలతో కలిసి ఎంతోకొంత పెన్షన్ రూపంలో చెల్లిస్తారు. షేర్లు నష్టాల్లో కొనసాగితే పెన్షన్ మొత్తం మైనస్‌లోకి పోతుంది. స్టాక్ మార్కెట్ ఒడిదొడుకులు, షేర్ల పెట్టుబడుల్లో ఉద్యోగులకు ఎలాంటి హక్కులు లేకపోవడంతో రిటైర్ అయిన ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారు' అని వారు ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం అనుసరిస్తున్న ఈ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గాంధీ జయంతి రోజు చేస్తున్న కార్యక్రమానికి ఉద్యోగులందరూ హాజరు కావాలని కోరారు.

విద్యుత్ రంగాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

- 2030 డిమాండ్ అంచనాతో గ్రీన్ ఎనర్జీకి కృషి
- టెయిల్ ఎండ్ ప్రాంతాల సాగునీటి పరిష్కారానికి పత్తిపాక రిజర్వాయర్
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- ఎల్లంపల్లి భూనిర్వాసితులకు రూ.18 కోట్ల పరిహారం అందజేత



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యుత్ రంగంలో దేశానికే ఆదర్శంగా తెలంగాణను తీర్చిదిద్దుతామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శనివారం పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలో ఐటి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షతో కలిసి భట్టి పర్యటించారు. మేడారం వద్ద 33/11 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు, కట్కెనపల్లి గ్రామంలోని 33/11కేవీ సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ధర్మారం, వెల్గటూరు, గొల్లపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పాల్గొని మాట్లాడారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నామని తెలిపారు. 2030నాటికి విద్యుత్ డిమాండ్‌ను అంచనా వేస్తూ.. ఆ దిశగా గ్రీన్ పవర్, సోలార్ పవర్, ఫ్లోటింగ్ సోలార్, పంప్ స్టోరేజ్ ఎనర్జీ మొదలగు రంగాల్లో దాదాపు 20వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పాదన లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. పైలెట్ ప్రాజెక్టు కింద కొన్ని గ్రామాలను ఎంపిక చేసి, రైతుల మోటార్లకు పూర్తి స్థాయిలో ప్రభుత్వ ఖర్చుతో సోలార్ పంపు సెట్లను ఏర్పాటు చేయబోతున్నామని చెప్పారు. అలాగే, కొన్ని ఆదర్శ గ్రామాలను ఎంపిక చేసుకుని ప్రతి ఇంటికీ సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేస్తామన్నారు. దశాబ్ది కాలంగా పెండింగ్‌లో ఉన్న ఎల్లంపల్లి నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రభుత్వం పరిష్కారం చూపించడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్ ఉన్న భూసేకరణ నిధులను అందజేస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం ఎల్లంపల్లి ప్రాజెక్టు ముంపు గ్రామాల ప్రజలకు రూ.18కోట్ల చెక్కులు అందజేశారు.

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. పదేండ్లపాటు పెండింగ్‌లో ఉన్న ఎల్లంపల్లి నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం మంత్రుల వెంబడి తిరిగి రూ.18 కోట్లు సాధించడంలో ప్రభుత్వ విప్ ఎంతో కృషి చేశారన్నారు. పత్తిపాక రిజర్వాయర్ ఏర్పాటు ద్వారా మంథని పెద్దపెల్లి, రామగుండం, ధర్మపురి నియోజకవర్గాలు సాగునీరు స్థిరీకరణ అవుతుందనే ఉద్దేశంతో సాగునీటి మంత్రికి ప్రతిపాదనలు సమర్పించినట్టు చెప్పారు. ప్రస్తుత బడ్జెట్ కేటాయింపుల్లో నిధులు కేటాయించామని తెలిపారు. ఎల్లంపల్లి భూ నిర్వాసితుల్లో 18ఏండ్లు నిండిన వారికి పరిహారం అందించే అంశంలో ఆర్డీవో, కలెక్టర్‌తో నివేదిక తెప్పించుకొని చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ విప్ అడ్లూరు లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. గతంలో ఇచ్చిన హామీ మేరకు ఎల్లంపల్లి భూనిర్వాసితుల సమస్య పరిష్కారం దిశగా చేగ్యాం గ్రామంలో 126ఇండ్లు కోల్పోయిన కుటుంబాలకు పరిహారం అందిందన్నారు. భూ నిర్వాసితుల సమస్యలపై ప్రతిపాదనలు కూడా కలెక్టర్ ద్వారా తెప్పించుకొని మరో రూ.7కోట్లు మంజూరు చేయాలని మంత్రులను కోరారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్, అదనపు కలెక్టర్లు జె అరుణ శ్రీ, జివి శ్యామ్ ప్రసాద్‌లాల్, ఆర్‌డిఒలు బి గంగయ్య, వి హనుమానాయక్ పాల్గొన్నారు.

బుక్ ఫెయిర్‌కు మద్దతిస్తాం

- గ్రంథాలయాల పరిషత్ చైర్మన్ రియాజ్ హామీ

ప్రజాశక్తి - హైదరాబాద్

రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బుక్ ఫెయిర్‌ను నిర్వహించడానికి సహయ, సహకారాలు అందించాలని రాష్ట్ర గ్రంథాలయాల పరిషత్ చైర్మన్ రియాజ్‌ను నిర్వాహకులు కోరారు. అఫ్జల్‌గంజ్‌లోని రాష్ట్ర కార్యాలయంలో శనివారం డాక్టర్ రియాజ్‌ను కలిసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ బుక్ ఫెయిర్ ప్రెసిడెంట్. కవి యాకూబ్, జనరల్ సెక్రెటరీ ఆర్ వాసు, కోశాధికారి పి నారాయణ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ సభ్యులు కుమార్, కృష్ణారెడ్డిలు పాల్గొన్నారు. డిసెంబర్‌లో నిర్వహించనున్న హైదరాబాద్ బుక్ ఫెయిర్‌కు అన్ని రకాల సాయం అందించాలని కోరగా.. రియాజ్ సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. అన్ని అన్ని జిల్లాల్లోనూ ఏర్పాటు చేసే హైదరాబాద్ బుక్ ఫెయిర్‌కు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని గ్రంథాలయాల పటిష్టతకు హైదరాబాద్ బుక్ ఫెయిర్ కూడా కీలక పాత్ర పోశించాలని రియాజ్ కోరినట్లు నిర్వాహకులు తెలిపారు.

సిఎం సహాయ నిధికి దివీస్ రూ.5 కోట్ల వితరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వరద బాధితుల సహాయార్థం ముఖ్య మంత్రి సహాయనిధికి దివీస్ ల్యాబొరేటరీస్ భారీ మొత్తాన్ని విరాళంగా అందించింది. శనివారం జూబ్లీహిల్స్ నివాసంలో సిఎం రేవంత్ రెడ్డిని దివీస్ ల్యాబొరేటరీ సిఇఒ డాక్టర్ కిరణ్ రూ.5కోట్ల చెక్‌ను అందజేశారు.

టిపిసిసి అధ్యక్షులుగా నేడు మహేష్‌కుమార్‌గౌడ్ బాధ్యతలు

హైదరాబాద్ బ్యూరో : టిపిసిసి నూతన అధ్యక్షులుగా ఎంపికైన బొమ్మన మహేష్‌కుమార్‌గౌడ్ ఆదివారం బాధ్యతలు చేపట్టనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు తెలంగాణ అమరవీరుల స్థూపం నుంచి భారీ ర్యాలీగా గన్‌పార్క్ వద్దకు చేరుకుంటారు. అమరవీరులకు నివాళులర్పిస్తారు. అనంతరం అక్కడ నుంచి గాంధీ భవన్‌కు వేలాది మంది కార్యకర్తలు, అభిమానులతో కలిసి ర్యాలీగా గాంధీభవన్‌కు బయలుదేరుతారు. మధ్యాహ్నం సుమారు రెండు గంటలకు గాంధీ భవన్‌కు చేరుకుంటారు. అక్కడ 2.45 నిమిషాలకు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ముఖ్యమంత్రి ప్రస్తుత టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి నుంచి మహేష్‌కుమార్‌గౌడ్ బాధ్యతలు స్వీకరిస్తారు. అనంతరం తర్వాత ఇందిరాభవన్ ముందు ఏర్పాటు చేసిన సభలో పాల్గొంటారు.



లక్ష్మీదేవమ్మ మృతికి సిఐటియు సంతాపం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) సీనియర్ నేత కామ్రేడ్ లక్ష్మీదేవమ్మ మృతికి సిఐటియు రాష్ట్ర కమిటీ తీవ్ర సంతాపాన్ని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలిపింది. శనివారం హైదరాబాద్, రామాంతపూర్‌లోని తన నివాసంలో ఆమె భౌతికకాయాన్ని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.భూపాల్, జె. చంద్రశేఖర్, రాష్ట్ర కార్యదర్శులు జె. వెంకటేష్, పద్మశ్రీ, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం. చంద్రమోహన్, సిహెచ్. రోజా తదితరులు సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. లక్ష్మీదేవమ్మ ఉమ్మడి రాష్ట్రం నుంచి మహిళా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలిగా బాధ్యతలు నిర్వహించారని తెలిపారు. హైదరాబాద్ ఐద్వా ఉద్యమంలో అవిశ్రాంతంగా కృషి చేశారని గుర్తు చేశారు. ప్రజా ఉద్యమంలో కడవరకూ పట్టుదలగా తన కర్తవ్యాన్ని నిర్వర్తించారని తెలిపారు. వారి కుటుంబం కూడా ప్రజాతంత్ర ఉద్యమంలో క్రియాశీలకంగా పని చేస్తున్నారని పేర్కొన్నారు. ఆమె ఆశయ సాధనకు సిఐటియు కార్యకర్తలందరూ పునరంకితం కావాలని కోరారు.

బిజెపి డిఎన్‌ఎలోనే వెనుకబడిన కులాలను అణచివేసే స్వభావముంది

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి అబ్బాస్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం, బిజెపి కుంటిసాకులు చెప్పడం మాని వెనుకబడిన కులాల జనాభా గణన సేకరణ చేపట్టాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి అబ్బాస్ డిమాండ్ చేశారు. వెనుకబడిన కులాల జనాభా గణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎర్ర సత్యం అధ్యక్షతన శనివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్బాస్ మాట్లాడుతూ తాను బిసి ప్రధానమంత్రిని అని చెప్పుకుంటున్న మోడీ వెనుకబడిన కులాల జనాభా లెక్కలు సేకరించకుండా ఎందుకు అడ్డు పడుతున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దేశంలో 60 శాతానికి పైగా ఉన్న వెనుకబడిన కులాల ఆర్థిక, సామాజిక పరిస్థితులు సమగ్రంగా అధ్యయనం చేయకుండా వారిని అభివృద్ధి చేయడం ఎలా సాధ్యమన్నారు. సిపిఎం వెనుకబడిన కులాల జనాభా లెక్కలు సేకరించాలని డిమాండ్ చేస్తున్నదనీ, పార్లమెంటులో ఈ అంశాన్ని లేవనెత్తి కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసిందని గుర్తు చేశారు. రాష్ట్రాల స్థాయిలో సేకరించే జనాభా లెక్కలకు చట్టబద్ధత ఉండదని బిహార్ హైకోర్టు తీర్పు రుజువు చేసిందన్నారు. కేంద్రం జనాభా లెక్కలు సేకరించే సందర్భంగానే కుల గణన చేపట్టాలనీ, అప్పుడే చట్టబద్ధత వస్తుందని తెలిపారు. బిజెపికి వెనుకబడిన కులాల ఓట్ల మీద ఉన్న శ్రద్ధ వారి అభివృద్ధిపై లేదని విమర్శించారు. గతంలో బిజెపి మండల్ ఉద్యమానికి వ్యతిరేకంగా మందిర్ ఉద్యమం ముందుకు తెచ్చిందని గుర్తు చేశారు. విపి సింగ్ ప్రభుత్వాన్ని కూల్చి వెనుకబడిన కులాల రిజర్వేషన్లు అడ్డుకున్నదని గుర్తు చేశారు.

శాస్త్రీయ సంగీత శిఖరం ఎంఎస్ సుబ్బలక్ష్మి

ప్రజాశక్తి కల్చరల్ : శాస్త్రీయ సంగీతంలో ఎంఎస్ సుబ్బలక్ష్మి శిఖర సమానులని ప్రముఖ సాహితీ వేత్త డాక్టర్ ఏనుగు నరసింహ రెడ్డి అన్నారు. ఆమె దేశ అత్యుత్తమ అవార్డ్ భారత రత్నతో నాటి ప్రభుత్వం గౌరవించుకొందని గుర్తు చేశారు. శ్రీ త్యాగరాయ గానసభలోని కళా సంగీత నాట్య వేదికపై గాన సభ నిర్వహణలో జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా భారత రత్న ఎంఎస్ సుబ్బలక్ష్మి జయంతి సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా డాక్టర్ నరసింహ రెడ్డి పాల్గొని కర్ణాటక సంగీతాన్ని ఉత్తర భారత దేశ హిందుస్తానీ సంగీతం పక్కన నిలిపి దేశ విదేశాల్లో ఆ సంగీతపు అపునత్యం చాటిన సుబ్బ లక్ష్మి తన గాళ మధుర్యంతో గాంధీజీ నెహ్రూలను ముగ్ధులను చేశారని వివరించారు. ప్రముఖ ఈల పాట కళా కారుడు కె శివ ప్రసాద్ మాట్లాడుతూ ఆది శంకరాచార్య భజ గోవిందం శ్లోకాలు సుబ్బలక్ష్మి గానంతో ప్రజలకు సన్నిహితం ఇనాయనీ చెప్పారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించి మాట్లాడుతూ మహ గాయని సుబ్బ లక్ష్మి నిత్య స్మరణీయురాలు అని ఆమె తైల వర్ణ చిత్రం గాన సభలో అలంకరించామని తెలిపారు వేదికపై గాయకుడు కల్యాణ్ కె, సంగీత గురువు మంజుల పాల్గొన్నారు.

సొంత జిల్లా ప్రజలపైనా
రేవంత్‌కు దయాదాక్షిణ్యాలు లేవా?

- గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల పట్టాలకే విలువలేదు
- త్వరలో పాలమూరు ప్రాజెక్టు సందర్శన
- బిఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పాలమూరు బిడ్డను.. పాలమూరు ప్రజల వల్లే తాను ముఖ్యమంత్రిని అయ్యానని పదే పదే చెప్పుకునే రేవంత్‌రెడ్డి.. కనీసం దయాదాక్షిణ్యాలు లేకుండా పేదల ఇళ్లపైకి బుల్డోజర్లతో నేలమట్టం చేశారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అన్నారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లాలో మాజీ మంత్రి లక్ష్మారెడ్డిని పరామర్శించిన అనంతరం కెటిఆర్ తిమ్మాజిపేట మండలం నేరేళ్లపల్లిలో మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి నివాసంలో మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2007లో కాంగ్రెస్ ప్రభుత్వంలో సిఎం రాజశేఖర్‌రెడ్డి హయాంలో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం క్రిస్టియన్‌పల్లిలో సర్వే నెంబర్ 523లో 75 మందికి 75 గజాల చొప్పున పట్టాలు ఇచ్చారని తెలిపారు. అందులో సింహభాగం వికలాంగులు, దళితులు, మైనార్టీలు ఉన్నారన్నారు. ఇప్పుడవి చెల్లకుండా పోయాయన్నారు. పేద ప్రజల ఇండ్లు కూలగొట్టడానికే పాలమూరు నుంచి ముఖ్యమంత్రివి అయ్యావా అని రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. పాలమూరు బిడ్డ అని చెప్పుకునే రేవంత్ రెడ్డికి కనీస సంస్కారం ఉంటే.. పేదల పట్ల కనికరం ఉంటే 75 కుటుంబాలకు డబుల్ బెడ్ రూమ్స్ కేటాయించాలని డిమాండ్ చేశారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన పట్టాలకే విలువ ఇవ్వని అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులు, భూసేకరణ వద్ద ఆగిన కాలువలను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. 95 శాతం పనులు పూర్తయిన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. అది పూర్తి చేస్తే మాజీ సిఎం కెసిఆర్‌కు పేరు వస్తదనేనా అని ప్రశ్నించారు. హైదరాబాద్‌కు నీరు అందించే సుంకిశాల వద్ద ప్రమాదం జరిగి రూ.75 నుంచి 80 కోట్ల నష్టం జరిగిందని చెప్పారు. మళ్లీ మెగా ఇంజినీరింగ్‌కి కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ కట్టబెట్టారని తెలుస్తోందని, ఆ సంస్థను బ్లాక్ లిస్టులో పెట్టాలని అన్నారు. ఆంధ్రా కాంట్రాక్టర్లు అంటూ మాట్లాడి.. ఇప్పుడు అన్నీ వాళ్లకే ఇస్తున్నారని, కెసిఆర్ ప్రభుత్వంపై చిల్లర మాటలు మాట్లాడిన రేవంత్‌రెడ్డి చెంపలు వేసుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

త్వరలోనే కెసిఆర్ అనుమతి తీసుకొని.. మేడిగడ్డకు ఎట్టా పోయినమో.. అలాగే బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టును సందర్శిస్తామని చెప్పారు. ఏ కంపెనీలను బూతులు తిట్టినరో.. జూటా కంపెనీలని అన్నారో వాటికే ఇప్పుడు రూ.4వేల 350 కోట్ల పనులు సిఎం సొంత నియోజకవర్గంలో కట్టబెట్టారని విమర్శించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, నవీన్ కుమార్ రెడ్డి, సుభాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటే్ రెడ్డి, బాల్క సుమన్, నాయకులు రవీంద్రనాథ్ రెడ్డి, దయాకర్ రెడ్డి, వేణుగోపాల్ గౌడ్, స్వామి, మోహనచారి తదితరులు ఉన్నారు

వృత్తికి వన్నె తెచ్చేలా ఇంజనీర్లు పనిచేయాలి

- సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధం
- నాణ్యత విషయంలో కాంట్రాక్టర్లతో కఠినంగా వ్యవహరించండి : మంత్రి సీతక్క



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

హైదరాబాద్ బ్యూరో : దేశ ప్రగతిలో ఇంజనీర్ల పాత్ర చాలా గొప్పదని, వారి వృత్తికి వన్నె తెచ్చేలా పని చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ సీతక్క (ధనసరి అనసూయ) అన్నారు. ఆనకట్టలు, రహదారులు, వంతెనలు నిర్మించి దేశ ప్రగతిని పరుగులు పెట్టించారని తెలిపారు. ఇంజనీర్లకు వాహన సదుపాయం, పెండింగ్‌లోనున్న డిఎ పిఆర్‌సి, పదోన్నతులు వంటి అంశాలను సిఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం తప్పకుండా పరిష్కరిస్తుందని తెలిపారు. రంగారెడ్డి జిల్లా పెద్ద అంబర్‌పేట్‌లో శనివారం జరిగిన పంచాయతీరాజ్ డిప్లమా ఇంజనీర్స్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశంలో మంత్రి ప్రసంగించారు. దేశ మొట్టమొదటి సివిల్ ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య స్ఫూర్తిగా ఇంజనీర్లు పనిచేయాలని సూచించారు. దేశ అభివృద్ధిలో ఇంజినీర్లు పోషించిన పాత్రను వివరించారు. ఎన్నో ఆనకట్టలకు కూలీలతోపాటు ఇంజినీర్లు కూడా రాళ్లెత్తారని, వారి కృషి ఫలితంగానే ఆహార సంక్షోభం వంటి ఎన్నో సంక్షోభాలను దేశం అధిగమించగలిగిందని చెప్పారు. మరీ ముఖ్యంగా సివిల్ ఇంజనీర్లు లేకపోతే దేశంలో ఈ అభివృద్ధి జరిగేది కాదన్నారు. నాణ్యత ప్రమాణాలను పెంచేలా ఇంజనీర్లు పనిచేయాలని సూచించారు. ఒకప్పుడు 20 ఏళ్లపాటు భద్రంగా ఉండే సిసి రోడ్లు, ఇప్పుడు చిన్నపాటి వర్షానికే దెబ్బ తినటం ఆందోళనకరమన్నారు. రోడ్ల నిర్మాణం, నిర్వహణలో సివిల్ ఇంజనీర్లు కాంట్రాక్టర్లతో కఠినంగా వ్యవహరించాలని కోరారు. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడొద్దని చెప్పారు. వర్షాలు, వరదల నేపథ్యంలో దెబ్బతిన్న రహదారులను మెరుగుపరిచే విషయంలో ఇంజనీర్లంతా ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. అవసరం అయితే అధిక సమయాన్ని కేటాయించేందుకూ సిద్ధపడాలని సూచించారు.ప్రతి గ్రామానికీ రోడ్డు కనెక్టివిటీ ఉండాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. అన్ని గ్రామాల్లో రహదారి, రవాణా సదుపాయాలను మెరుగుపరిచే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. వృత్తికి వన్నె తెచ్చేవారినే చరిత్ర గుర్తు పెట్టుకుంటుందని, అందుకే మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదినాన్ని ఇంజినీర్స్ డేగా సెలబ్రేట్ చేసుకుంటున్నామని అన్నారు. ఈ సమావేశంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మెన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ఈఎన్‌సీ కనక రత్నం, ఇతర ఉన్నతాధికారులు, పంచాయతీ శాఖ ఇంజినీర్లు పాల్గొన్నారు.

ఎంత ఉన్నతికి ఎదిగినా సంస్కారం ముఖ్యం

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి

ప్రజాశక్తి - కల్చరల్

ఉన్నత స్థాయికి ఎదగడమే ముఖ్యం కాదని ఎంత సంస్కార వంతంగా వారు వున్నారన్న దానిపై వారికి సమాజంలో గుర్తింపు ఉంటుందని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం న్యాయ మూర్తి జస్టిస్ రాధా రాణి అన్నారు. అక్కినేని నాగేశ్వరరావు భానుమతి ఉత్తమ సంస్కార వంతులని, వారి పేరిట పురస్కారం అందుకున్న తనికెళ్ల భరణి అందుకు అర్హుడని అభినందించారు శ్రీ త్యాగరాయ గాన సభ మెయిన్ హాల్‌లో వంశీ ఆర్ట్స్ థియేటర్స్ 53వ వార్షిక వేడుకలులో భాగంగా ప్రముఖ నటుడు తనికెళ్ల భరణికి అక్కినేని భానుమతి పేర వంశీ పురస్కారం ప్రదాన సభ జరిగింది ముఖ్య అతిథిగా జస్టిస్ రాధా రాణి పాల్గొని పురస్కారం బహుకరించి మాట్లాడారు. భానుమతి స్వాభిమానమున్న నటి దర్శకురాలు రచయిత్రి గాయని స్టూడియో అధినేత అని, అక్కినేని కూడా ఉన్నత నటనతో పాటు తన ఆలోచనలు ఆ పేరిట రాశారని అన్నారు. తనికెళ్ల భరణి శివ సినిమాలో ప్రతి నాయక పాత్ర నుంచి హాస్య నటునిగా రచయితగా మిథునం సినిమాతో దర్శకునిగా గుర్తింపు పొందారు అన్నారు. ఈ సందర్భంగా వంశీ కథలు సంపుటి ఆవిష్కరించారు. సాహితీ వేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం అధ్యక్షత వహించిన సభలో వంశీ రామరాజు సంపుటిని లాంఛనంగా ఉగాండా నివాసం ఉన్న డాక్టర్ బి వ్యాసకృష్ణ రాధలకు అంకితం ఇచ్చేరు వేదికపై దర్శకుడు రేలంగి నరసింహారావు వికలాంగ సంస్థ జాతీయ నాయకుడు కె నాగేశ్వర రావు సాహితీ కిరణం సంపాదకుడు పోత్తూరి సుబ్బారావు తదితరులు పాల్గొనగా వంశీ రామరాజు స్వాగతం పలుకుతూ వంశీ సంస్థ తన 25 ఏళ్ల వయస్సులో స్థాపించేననీ తెలిపారు.

మానవ సంబంధాలు విచ్ఛిన్నం

- దయాబెటిస్‌కి రాజధానిగా భారత్
- పోషకాహార లోపలే ప్రధాన కారణం
- జెవివి రాష్ట్ర గౌరవ అధ్యక్షులు డాక్టర్ మహతాబ్ ఎస్ బాంజీ
- విద్యారంగంపై రాజ్యం, మార్కెట్, మతం ప్రభావం : హరగోపాల్
- సమాజ పురోగతికి ప్రశ్నే కీలకం : శ్రీనివాస్
- ఎఎస్‌రావు నగర్‌లో జెవివి రాష్ట్ర ఐదో మహాసభ ప్రారంభం


మహా సభలో మాట్లాడుతున్న ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె శ్రీనివాస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మానవ సంబంధాలు విచ్ఛిన్నమవుతున్నాయని, బంధాలు, బంధుత్వాలు నిలబడటం లేదని ప్రముఖ పోషకాహార శాస్త్రవేత్త, జెవివి రాష్ట్ర గౌరవ అధ్యక్షులు డాక్టర్ మహతాబ్ ఎస్ బాంజి అన్నారు. సమాజంలో లింగ వివక్ష దారుణమైన స్థాయికి చేరుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. రెండ్రోజులపాటు జరగనున్న జనవిజ్ఞాన వేదిక 5వ రాష్ట్ర మహాసభ శనివారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఏఎస్‌రావు నగర్‌లోని అణుపురం కమ్యూనిటీ హాల్‌లో ప్రారంభమైంది. జెవివి జెండాను సీనియర్ నాయకులు మహ్మద్ ఆండాలి ఎగురవేశారు. జాతీయ జెండాను జెవివి ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ జెతిన్ కుమార్ ఎగురవేశారు. మహాసభకు 33 జిల్లాల నుంచి 200 మంది ప్రతినిధులు హాజరయ్యారు. జెతిన్ కుమార్ అధ్యక్షతన జరిగిన సభలో డాక్టర్ మహతాబ్ ఎస్ బాంజి మాట్లాడుతూ.. సమాజాన్ని చెడు దారి నుంచి మంచి దారిలో నడిపించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం అన్నారు. సమాజంలో ఉపాధ్యాయులది కీలకమైన పాత్ర అని, విద్యార్థులకు సామాజిక స్పృహ కల్పించడానికి కృషి చేయాలని సూచించారు. విశ్వవిద్యాలయాలు నేడు తమ భావ స్వేచ్ఛను ప్రకటించే అవకాశం కూడా ఇవ్వడం లేదన్నారు. ఒకప్పుడు విద్యా వ్యవస్థలో నైతిక విలువలు తెలియజెప్పే పాఠ్యపుస్తకాలు ఉండేవని, ఇప్పుడు మళ్లీ వాటిని పునరుద్ధరించాల్సిన అవసరం ఏర్పడిందని అన్నారు. మహిళలకు కావాల్సిన కనీస ఆరోగ్య అవసరాలు, పోషకాహారం సరిగా అందటం లేదని, దీనిపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని కోరారు. భారతదేశం డయాబెటిస్‌కు రాజధానిగా మారిందని, దీనికి కారణం పోషకాహార లోపమేనని చెప్పారు.

'విద్యా విధానం-వక్రీకరణలు' అనే అంశంపై ప్రముఖ సామాజిక విశ్లేషకులు ప్రొఫెసర్ జి హరగోపాల్ మాట్లాడుతూ.. యూనివర్సిటీల స్వేచ్ఛను ప్రభుత్వం హరిస్తోందన్నారు. విద్యారంగం మీద రాజ్యం, మార్కెట్, మతం తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విశ్వవిద్యాలయాలను నిర్వీర్యం చేసి తమ అదుపులోకి తెచ్చుకోవడానికి కేంద్రం ప్రయత్నం చేస్తోందని, బడ్జెట్‌లో యూనివర్సిటీలకు 60 శాతం కేటాయింపులు తగ్గించడమే దీనికి నిదర్శనమని అన్నారు.

మనం ప్రస్తుతం కౌంటర్ రెవల్యూషన్‌లో ఉన్నామన్నారు. మానవ సంబంధాలు తీవ్ర సంక్షోభంలో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠాలు, చరిత్రను మారుస్తున్నారన్నారు. కొత్త సమస్య వస్తే కొత్త కోర్సు వస్తోందన్నారు. సమాజం ప్రశ్న దగ్గరే ఆగిందన్నారు. విశ్వవిద్యాలయాలు, విద్య నిర్బంధంలో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. యూనివర్సిటీల్లో ఒకే భావజాలానికి సంబంధించిన వారినే రిక్రూట్ చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సమాజంలో సామాజిక చైతన్యం పెరగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

ప్రజాస్వామ్యానికి జన్మస్థానం భారత్ : ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె శ్రీనివాస్

ప్రజాస్వామ్యానికి జన్మస్థానం భారతదేశం అని ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె శ్రీనివాస్ అన్నారు. ఆయన 'ప్రగతికి తొలిమెట్టు ప్రశ్న' అనే అంశంపై మాట్లాడారు. జన విజ్ఞానం అంటే జనుల్లో ఉన్న విజ్ఞానమా..? జనం కోసం విజ్ఞానమా..? అని ప్రశ్నించారు శాస్త్ర విజ్ఞానాన్ని, విశ్వాసాన్ని వేరు చేశారన్నారు. సమాజ పురోగతికి ప్రశ్నే కీలకం అన్నారు. హేతువాదులు ప్రశ్నించడమే కాదు.. చాంధస్స వాదులు వేస్తున్న ప్రశ్నలకు సమాధానాలు సిద్ధం చేసుకుని వారికి గట్టి పోటీనివ్వాలని సూచించారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా హేతువాదులు తమ పంథాను మార్చుకోవాలన్నారు. హేతువాదులు ఎదుటి వారిని ప్రశ్నించడమే కాదు, తమను తాము ప్రశ్నించుకోవాలన్నారు. ప్రశ్నించే వారి ప్రాతిపదికను ఎవరికి వారే నిర్మించుకుంటున్నారని తెలిపారు. సోషల్ మీడియా వచ్చిన తర్వాత సమాచార వృద్ధి పెరిగిందన్నారు. వార్తల వృద్ధి పెరిగినట్టే ఫేక్ న్యూస్ కూడా పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. కొత్తగా మాట్లాడటం నేర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కోయ వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి టి శ్రీనాథ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం శ్రీనివాస్, కోశాధికారి వరప్రసాద్, సెక్రెటరీ సభ్యులు ఆనంద్‌కుమార్, రాష్ట్ర నాయకులు ప్రొఫెసర్ బిఎన్ రెడ్డి, ప్రొఫెసర్ రామచంద్రయ్య, ప్రొఫెసర్ సత్యప్రసాద్, రాజ, రమాదేవి, పి నాగరాజు ఎస్‌కె బురాన్, మల్లయ్యాచారి, ఎండి ఆండాళు తదితరులు పాల్గొన్నారు.


మధుసూదన్‌ను అభినందిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

ఉమ్మడి నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల మదర్ డెయిరీ ఎన్నికలు

- చైర్మన్‌గా గుడిపాటి మధుసూదన్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉమ్మడి నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల పాల ఉత్పత్తిదారుల మదర్ డెయిరీ ఎన్నికలు శనివారం జరిగాయి. చైర్మన్‌గా తుర్కపల్లి మండలం వేల్పల్లె గ్రామానికి చెందిన గుడిపాటి మధుసూదన్‌రెడ్డిని హయత్‌నగర్‌లోని మదర్ డెయిరీ కార్యాలయం వద్ద ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నియామకపత్రాన్ని రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మదర్ డెయిరీ సంస్థను కాపాడుతూ, రైతుల పక్షాన నిలబడుతూ సంస్థను అభివృద్ధి పథంలో నడిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, మదర్ డెయిరీ మాజీ చైర్మన్ గుత్తా జితేందర్‌రెడ్డి, వివిధ జిల్లాల నాయకులు, మదర్ డైరెక్టర్లు, ఆలేరు వ్యవసాయ కమిటీ చైర్మన్ చైతన్య మహేందర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

20న మంత్రివర్గ సమావేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర మంత్రివర్గ సమావేశాన్ని ఈ నెల 20న డా బిఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో నిర్వహించనున్నారు. సాయంత్రం 4 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ఈ కేబినెట్ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించనున్నారు. రాష్ట్రంలో వరదలు, కేంద్ర ప్రభుత్వం సాయంపై సమావేశంలో ప్రస్తావించనున్నారు. హైడ్రా పని విధానం-దీని చట్టబద్ధతకు ఆర్డినెన్స్ తీసుకొచ్చే అంశం, బిసి రిజర్వేషన్, కులగణన, 200 పంచాయతీల ఏర్పాటు, స్థానిక సంస్థల ఎన్నికలు, రుణమాఫీ, రైతుభరోసాపై చర్చించే అవకాశం ఉంది.

చిన్నారులపై వీధి కుక్కల దాడి

- ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పెద్దపల్లి జిల్లా మంథని మండలం స్వర్ణపల్లి గ్రామంలో ఇద్దరు చిన్నారులపై వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. శనివారం ఉదయం ఇంటి ముందు ఆడుకుంటున్న చిన్నారులు నల్లబోతుల మానసశ్రీ (5) కోరవేన వేదన్స్ (3)పై కుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. దాంతో తీవ్రంగా గాయపడిన వారిని మంథని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వెంకటపూర్‌లోనూ ఓ చిన్నారి, యువకుడిపై వీధి కుక్కలు దాడి చేసి గాయపరిచాయి.

రేస్ ఈకో, గణేషా ఈకోస్ఫేర్ జట్టు

హైదూఖాద్ : ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌లోని రేస్ ఈకో చెయిన్ లిమిటెడ్, గణేషా ఈకోస్ఫేర్ లిమిటెడ్ ఒప్పందం కుదర్చుకున్నాయి. ఈ సంయుక్త భాగస్వామ్యంలో పిఇటి రీసైకిల్ కోసం గణేషా రీసైక్లింగ్ చెయిన్ ప్రయివేటు లిమిటెడ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపాయి. దీంతో దేశ వ్యాప్తంగా ప్లాస్టిక్ బాటిళ్లను తిరిగి రీసైక్లింగ్ ద్వారా ఉపయోగంలోకి తేవాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. కొత్త సంస్థలో రేస్ ఈకోకు 51 శాతం, గణేషా ఈకోస్ఫేర్‌కు 49 శాతం చొప్పున వాటాలు ఉన్నాయి.

పోలీసు ఎన్‌కౌంటర్లపై నిజాల స్వేచ్ఛను కాపాడాలి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పోలీసు ఎన్‌కౌంటర్లపై నిజాలు తెలుసుకునే స్వేచ్ఛను కాపాడలని నిర్బంధ వేదిక కన్వీనర్ ప్రొఫెసర్ జి హరగోపాల్, రాఘవాచారి, కో-కన్వీనర్ రవిచందర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కరకుగూడెం, రఘునాథపాలెం అడవుల్లో ఉపాధ్యాయ దినోత్సవం రోజున పోలీసులు భారీ ఎన్‌కౌంటర్ కు పాల్పడ్డారని తెలిపారు. ఆ ఘటనలో ఆరుగురు మరణించారని పేర్కొన్నారు. పరిశీలన కోసం 16 మంది ప్రతినిధులతో పౌర హక్కుల సంఘం నిజనిర్ధారణ బృందం శనివారం బయలుదేరిందని తెలిపారు. వీరిని మణుగూరులో అరెస్టు చేశారనీ, ఆ తర్వాత ప్రయివేట్ స్కూలు బస్సులో అక్కడి నుండి ఎక్కడికి తరలిస్తున్నారో, ఎందుకు తరలిస్తున్నారో చెప్పకుండా తీసుకెళ్లటమేంటని ప్రశ్నించారు. గత ప్రభుత్వం నిర్బంధ విధానాలను అమలు చేయటం వల్లనే పౌర సమాజం ఆ ప్రభుత్వాన్ని ఓడించిందని గుర్తు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి తాను స్వయంగా ప్రకటించిన ఏడో గ్యారెంటీకి కట్టుబడి రాష్ట్రంలో ప్రజాస్వామ్య పాలన అమలు చేయాలని డిమాండ్ చేశారు. అరెస్టు చేసిన 16 మంది సభ్యుల నిజనిర్ధారణ బృందాన్ని విడుదల చేసి, నిజా నిజాలు తెలుసుకునే స్వేచ్ఛ కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

ట్రాక్టర్ ట్రాలీల దొంగల అరెస్ట్

- నలుగురు నిందితులకు రిమాండ్
- 19 ట్రాలీలు, బైక్, స్వరాజ్ ఇంజన్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పి సన్‌ప్రీత్ సింగ్


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పి సన్‌ప్రీత్ సింగ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రామాల్లో పొలాల వద్ద, రోడ్ల పక్కన రైతులు పెట్టిన ట్రాక్టర్ల ట్రాలీలను చోరీ చేస్తున్న నలుగురిని అరెస్టు చేసినట్టు ఎస్పి సన్‌ప్రీత్‌సింగ్ తెలిపారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పి మీడియాకు వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి..

నల్లగొండ జిల్లాకు చెందిన సంపంగి మహేశ్, సంపంగి సత్యం, ఒర్సు వెంకన్న, అలకుంట్ల మహేశ్ కలిసి.. గ్రామాల్లో పొలాల వద్ద, రోడ్ల పక్కన రైతులు పెట్టిన ట్రాక్టర్ ట్రక్కులను గుర్తించి దొంగిలిస్తున్నారు. వాటిని తక్కువ ధరకు ఇతర రైతులకు అమ్ముతున్నారు. ఈ క్రమంలో వీరు పల్సర్ బైక్‌పై ఇద్దరు, స్వరాజ్ ట్రాక్టర్ ఇంజిన్‌పై ఇద్దరు కుంటపల్లి వైపు నుంచి మద్దిరాల వస్తుండగా మద్దిరాల ఎస్ఐ తన సిబ్బందితో కలిసి నలుగుర్ని అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో వారు ట్రాక్టర్ ట్రాలీలను చోరీ చేస్తున్నట్టు తేలింది. 2023 అక్టోబర్ లో పోలుమళ్ల గ్రామం నుంచి చిల్పకుంట్ల గ్రామానికి వెళ్లే మార్గంలో పొలాల్లో ఉంచిన రెండు ట్రాక్టర్ ట్రాలీలను చోరీ చేశారు. దీనిపై పోలుమళ్ల గ్రామానికి చెందిన ఎల్లు జగన్, రామారెడ్డి గతంలో మద్దిరాల పిఎస్‌లో ఫిర్యాదు చేశారు. నిందితులు మునగాల, పెన్‌పహాడ్, మిర్యాలగూడ రూరల్, నాగారం, మద్దిరాల, గుర్రంపోడు, నూతనకల్, మోతె, గరిడేపల్లి, శాలిగౌరారం, సూర్యాపేట రూరల్, కేతెపల్లి పరిధిలో మొత్తం 19 ట్రాక్టర్ల ట్రాలీలు చోరీ చేశారు. 19 ట్రాక్టర్ ట్రాలీలు, ఒక ఇంజిన్, బైక్‌ను స్వాధీనం చేసుకుని వారిని రిమాండ్‌కు తరలించారు. వీటి విలువ రూ.20లక్షలకుపైగా ఉంటుంది. వీటిని నల్లగొండ జిల్లా హాలియా మండలం మారేపల్లి గ్రామంలో నిందితుడు సంపంగి మహేష్ ఇంటి వద్ద స్వాధీనం చేసుకున్నారు. సూర్యాపేట జిల్లాలో 11 దొంగతనాలు, నల్లగొండ జిల్లాలో ఏడు దొంగతనాలకు పాల్పడ్డారు. ఈ 18 కేసులు కాకుండా నిందితులు సంపంగి మహేశ్, సంపంగి సత్యం, ఒర్సు వెంకన్న గతంలో 12 కేసుల్లో నేర చరిత్ర కలిగి ఉన్నారు. మహేష్, వెంకన్నను రాచకొండ కమిషనరేట్ ఆదిభట్ల పోలీసు స్టేషన్ వారు ట్రాక్టర్ ట్రాలీ కేసులో జైలుకు పంపారు. కేసు ఛేదించడంలో కృషి చేసిన సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ శివ కుమార్, తుంగతుర్తి సిఐ శ్రీను, సిసిఎస్ ఎస్ఐ శ్రీకాంత్, మద్దిరాల ఎస్ఐ వీరన్న, పర్యవేక్షణ చేసిన డిఎస్‌పి రవి, సిసిఎస్ సిబ్బంది వెంకన్న, శ్రీనివాస్, గురు స్వామి, మల్లేష్, ఆనంద్, శివ, సతీష్, ప్రభాకర్‌ను ఎస్పి అభినందించి రివార్డు అందజేశారు. ఈ సమావేశంలో ఎఆర్ అదనపు ఎస్పి జానార్ధన్ రెడ్డి, సూర్యాపేట డిఎస్‌పి రవి, తుంగతుర్తి సిఐ శ్రీను, సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ శివ కుమార్, ఎస్ఐలు శ్రీకాంత్, వీరన్న, సిసిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.


సాఫ్ట్‌వేర్ నూతన బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్ బాబు

సాఫ్ట్‌వేర్ కంపెనీతో ఉద్యోగావకాశాలు

- ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మంథనిలో ఏర్పాటు చేసిన సాఫ్ట్‌వేర్ కంపెనీతో నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. శనివారం పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలో గోదావరిఖని రోడ్డున గల గిట్లస్ హబ్ వద్ద హైదరాబాద్‌కు చెందిన సెంటిలియన్ నెట్‌వర్క్ ప్రయివేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాఫ్ట్‌వేర్ నూతన బ్రాంచ్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంథని మారుమూల ప్రాంతంలో సాఫ్ట్‌వేర్ కంపెనీ స్థాపించడం చాలా సంతోషకరమన్నారు. రానున్న రోజుల్లో మంథని ప్రాంతంలో మరిన్ని పరిశ్రమలు, కంపెనీలు వస్తాయని చెప్పారు. ఈ ప్రాంతం అభివృద్ధి పథంలో ముందుకెళుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిఇఒ చుంది వెంకట్, డైరెక్టర్ రాధా కిషోర్, సిద్ధార్థ, వైస్ ప్రెసిడెంట్ సుధాకర్, హరిలు పాల్గొన్నారు.

అదృశ్యమైన బాలుడు శవమై దొరికాడు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిజామాబాద్ జిల్లా చిట్టాపూర్ గ్రామంలో 12 ఏళ్ల బాలుడు అదృశ్యమైన కేసు విషాదాంతమైంది. ఎసిపి బస్వారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా బాల్కొండ మండలం చిట్టాపూర్ గ్రామానికి చెందిన కచ్చు రాకేశ్ (12) అనే బాలుడు మూడు రోజుల క్రితం అదృశ్యమయ్యాడు. దీనిపై బాలుడి తండ్రి లక్ష్మయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

శనివారం బాల్కొండలోని ఖిల్లాగుట్ట ప్రాంతంలో బాలుడి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. రాకేశ్ ఈనెల 11న రాత్రి అదే గ్రామానికి చెందిన బండి నరేందర్ అనే యువకుడితో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్లాడని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. పోలీసులు నరేందర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు ఎసిపి తెలిపారు.

గంజాయి తరలిస్తున్న నిందితులు అరెస్ట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ నగరంలోని పెద్ద అంబర్‌పేట్ ప్రాంతంలో భారీగా గంజాయిని ఎక్సైజ్ పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఒడిశా నుంచి మహారాష్ట్రకు గంజాయి తరలిస్తున్నారన్న సమాచారంతో దాడులు చేసి పట్టుకున్నామని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ డైరెక్టర్ ఖురేషి చెప్పారు. "నిందితుల కదలికలను చాలా రోజులుగా గమనించాం. పక్కా సమాచారంతో 170 కిలోల గంజాయి సీజ్ చేశాం. ఈ ముఠాలో ఎనిమిది మందిని అరెస్టు చేశాం. నిందితులు అందరూ మహారాష్ట్రలోని ఒకే గ్రామానికి చెందిన వారు. గంజాయి సరఫరా చేయడానికి వాహనాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్నారు. ఈ వాహనానికి ముందు మరొక వాహనంతో ఎస్కార్ట్‌గా వెళ్తున్నారు. మల్కాన్‌గిరి ప్రాంతంలో ఈ గంజాయిని ప్యాక్ చేసి మహారాష్ట్రకు తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. ఈ ముఠాలో ఇస్మాయిల్ అనే వ్యక్తి ప్రధాన నిందితుడుగా ఉన్నట్లు గుర్తించాం. పట్టుబడ్డ గంజాయి విలువ రూ.34 లక్షలు ఉంటుంది. ఈ కేసులో నిందితుల నేర చరిత్రను బట్టి పీడీ యాక్ట్ పెడతాం" అని ఖురేషి వివరించారు.

మతం మారిన దళితులపై కేంద్రం వివక్ష

- 1950లో తెచ్చిన ఆర్డినెన్స్ రాజ్యాంగ విరుద్ధం
- సిఆర్ఐఐ రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మతం మారిన దళితులపై కేంద్ర ప్రభుత్వం వివక్ష కొనసాగిస్తున్నదని పలువురు వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. మతాలకతీతంగా రిజర్వేషన్లను కల్పించాలని డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లోని టూరిజం ప్లాజాలో సివిల్ రైట్స్ ఇన్షియేటివ్ ఇంటర్నేషనల్ (సిఆర్ఐఐ) ఆధ్వర్యంలో డేనియల్ ఆఫ్ ఫ్రీడమ్ టూ దళిత్ అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. రిటైర్డ్ ఐపిఎస్ అధికారి బాబురావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి తెలంగాణ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మెన్ దీపక్ జాన్, రిటైర్డ్ ఐపిఎస్ అధికారి మధు, ఐఎఎస్ అధికారి రాణి కుముదుని, సుప్రీంకోర్టు న్యాయవాది ఫ్రాంక్లిన్ థామస్, ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ తదితరులు హాజరై మాట్లాడారు. దళిత కులాల్లో జన్మించి మతం మారిన కారణంగా రిజర్వేషన్లు మార్చడం ఎంత మాత్రం సమర్థనీయం కాదని అన్నారు. దేశంలో ఏ మతంలో లేనివిధంగా కేవలం దళితులు మతం మారిన వెంటనే వారి రిజర్వేషన్లను తొలగించడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. 1950లో తెచ్చిన ఆర్డినెన్స్ రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. సచారి కమిషన్ నుంచి మొదలుకుని నేటి బాలకిషన్ కమిషన్ వరకు 70 ఏళ్లుగా దళిత క్రైస్తవులు అన్యాయానికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలో ఉన్న ప్రభుత్వాలు కాలయాపనకు కమిషన్లు వేసి చేతులు దులుపు కుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని దళిత క్రైస్తవులందరూ ఐక్యంగా ప్రజా ఉద్యమం చేపట్టాలని వక్తలు పిలుపు నిచ్చారు. మత పరమైన రిజర్వేషన్లపై ప్రజాభిప్రాయ సేకరణ జరుపుతున్న బాలకిషన్ కమిషన్ రాష్ట్రంలో పర్యటించనున్న నేపథ్యంలో. క్రైస్తవులంతా వారి ముందు తమ వాదనను బలంగా వినిపించాలని సమావేశం ఏక గ్రీవంగా తీర్మానించింది.

వ్యవసాయ సలహాదారుగా పోచారం బాధ్యతలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖ సలహాదారుగా మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టారు. శనివారం హైదరాబాద్, నాంపల్లి పబ్లిక్‌గార్డెన్ ఉద్యానవన కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు కే. కేశవరావు, నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోచారం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వ్యవసాయదారులు దేశానికి అన్నం పెట్టేవారనీ, ఆయన్ను సరిగ్గా చూసుకుంటే దేశ ప్రగతి సుభిక్షంగా ఉంటుందని చెప్పారు. దేశానికి, రాష్ట్రానికి రైతే వెన్నుముక...అలాంటి రైతు కష్టాలను తీర్చేలా ప్రభుత్వం, అధికారులు కృషి చేయాలని కోరారు. ఆర్థిక పరిస్థితులు సరిగ్గా లేకపోయినా రైతుల సంక్షేమం కోసం రుణమాఫీ, రైతు భరోసా పథకాలు, ప్రాజెక్టుల పూర్తి వంటి వాటికి సిఎం రేవంత్ రెడ్డి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. వ్యవసాయ శాఖ మంత్రిగా పని చేసిన అనుభవంతో సలహాలు ఇస్తూ వ్యవసాయ రంగ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

కాలుష్య కాసారం 'మూసీ'

- మురికి కూపంగా మారిన జీవనది
- పక్షాళనకు రూ.58 వేల కోట్లు కేటాయించాలి
- సిపిఎం పోరాటంతోనే పిల్లాయిపల్లి కాలువ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఫార్మా ఇండస్ట్రీ, పరిశ్రమల వ్యర్థాల వల్ల జీవ నది మూసీ విషం, కాలుష్య కాసారంగా మారింది. ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిసర ప్రాంతాల్లో మూసీకి ఇరువైపులా వెలసిన పరిశ్రమల వ్యర్థ రసాయనాలను అందులోకి వదలడం వల్ల పూర్తిగా కలుషితమై నీరు రంగు మారుతోంది. మూసీ పరివాహక ప్రాంతంలోని భూగర్భ జలాలు కూడా కలుషితం అవుతున్నాయి. 40 ఏండ్ల కిందట తాగునీటి అవసరాలు తీర్చిన మూసీ.. ఇప్పుడు మురికి కూపంగా మారింది. నల్లగొండ జిల్లాలోని పంట పొలాలు విషతుల్యంగా మారిపోయాయి. ప్రత్యామ్నాయ సదుపాయాలకు అవకాశం ఉన్నా పాలకులు పట్టించుకోక.. గత్యంతరం లేక.. ప్రజలు ఏళ్ల తరబడి ఈ నీటినే వాడుతూ తీవ్ర అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. మూసీ ప్రక్షాళన, గోదావరి జలాల కోసం సిపిఎం ఆధ్వర్యంలో ఎన్నో ఏళ్లుగా పోరాటం సాగుతోంది.

మూసీ పరివాహక ప్రాంతంలో ఉన్న పిలాయిపల్లి కాలువ, బునాదిగానిగాని కాలువ, ధర్మారెడ్డి పల్లె కాలువ, 160 చెరువులు ఉన్నాయి. కాలువల నీటి ఆధారంగానే పోచంపల్లి, బీబీనగర్, చౌటుప్పల్, రామన్నపేట, చిట్యాల, ఆత్మకూర్, మోత్కూర్ ఇలా సుమారు పది మండలాల్లో లక్షల ఎకరాల్లో పంటలు పండిస్తున్నారు. కాలుష్యంపై 104 దేశాల్లోని 258 నదులపై సైంటిస్టులు చేసిన పరిశోధనల్లో ప్రమాదకర నదులలో మూసీ 22వ స్థానంలో ఉంది. మూసీ నీళ్లలో కెమికల్స్ విపరీతంగా పేరుకుపోతు న్నాయని శాస్త్రవేత్తలు తేల్చారు మూసీ నీటిలో 48 రకాల క్రియాశీలక ఔషధ పదార్థాల ఆనవాళ్లు ఉన్నాయి. యాంటీ బయోటెక్స్ బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్లకు వాడే మందులు యాంటీ డిప్రెసెంట్లు ఎక్కువ మోతాదులో ఉన్నాయని వెల్లడించింది. మూసీ ప్రాంత భూగర్భ జలాలు మెడిసిన్‌తో సమానం. ఈ నీరు తాగడం వల్ల ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు మందులు పనిచేయవని, కొత్త రోగాలు వస్తాయని తేల్చారు.

ఫార్మా డంపింగ్ యార్డ్‌గా..

ఫార్మాసిటికల్స్‌తో కలిసి మూసీ ఫార్మా డంపింగ్ యార్డ్‌గా మారింది. ఈ పరివాహక ప్రాంతంలో 70 కిలోమీటర్ల దాకా నీరు కలుషితమైంది. భూగర్భంలో నలభై మీటర్లు లోతు వరకు విషతుల్యమైంది. మూసీ పరివాహక ప్రాంతం వెంట 12వేలకు పైగా పరిశ్రమలు ఉన్నాయని, వాటి నుంచి వెలువడే కాలుష్యం, వ్యర్థపదార్థాలతో మూసీ కాలువ మురికి కూపంగా, డంపింగ్ యార్డ్‌గా మారిందని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మూసీ ప్రక్షాళనకు, కాలుష్య నివారణకు తగు చర్యలు చేపట్టాలని, ప్రత్యామ్నాయ నీటిని అందించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. మూసీ నీళ్లతో రకరకాల క్యాన్సర్లు, కిడ్నీ వ్యాధులు, చర్మ వ్యాధులు, గర్భస్రావాలతో మహిళలు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కమ్యూనిస్టుల పోరాటం ద్వారానే పిల్లాయిపల్లి కాలువ

ఈ ప్రాంత రైతాంగానికి సాగునీరు అందించాలని గతంలో సిపిఎం ఆధ్వర్యంలో నాలుగు రోజులపాటు 90 కిలోమీటర్లు పాదయాత్ర నిర్వహించారు. ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వానికి ఈ ప్రాంత రైతాంగం బాధలను పాదయాత్ర ద్వారా తెలియపరచడంతో పిల్లాయిపల్లి కాలువ మరమ్మతుల కోసం రూ.23 కోట్ల 52 లక్షలతో పనులను ప్రారంభించింది.



చట్టసభలో కమ్యూనిస్టులు లేకపోవడం వల్లే నిర్లక్ష్యం : జహంగీర్

చట్టసభల్లో కమ్యూనిస్టులు లేకపోవడం వల్లే పిల్లాయిపల్లి కాలువ పనులు, భువనగిరి పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని ప్రాజెక్టులు నిర్లక్ష్యానికి గురయ్యాయి. పేదోడిని గెలిపిస్తే పేదల సమస్యలపై ప్రభుత్వాలను ప్రశ్నిస్తారు. ధనవంతులను గెలిపిస్తే వారు మరింత ధనవంతులు ఎలా అవ్వాలనే ఆలోచనతో పని చేస్తారు. భూమి, భుక్తి కోసం జరిగిన పోరాటాల్లో కమ్యూనిస్టులు కీలక పాత్ర పోషించారు. ప్రజలు ఆలోచించి.. ప్రజల పక్షాన పోరాడే అధికారంలో ఉన్నా లేకపోయినా ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కొట్లాడుతున్న వారిని చట్టసభలకు పంపించాలి.